క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పత్తికొండలో డెంగీ బారిన పడిన బాలిక వివరాలు సేకరిస్తున్న డాక్టర్ సుజాత

పత్తికొండ రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుజాత, మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పత్తికొండలోని బండిగేరిలో డెంగీ బారిన పడిన 8 ఏళ్ల బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కాలనీలో పారిశుద్ధ్య పనులు చేయించి, దోమల నియంత్రణ మందు పిచికారీ చేయించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాశ్, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ కరుణ పాల్గొన్నారు.

ఘనంగా మస్తాన్ వలి స్వామి ఉరుసు



నంచర్లలో స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు..

చిప్పగిరి: నంచర్ల గ్రామంలో దివానే మస్తాన్ వలి స్వామి 39 ఉరుసు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ప్రతిమను గుర్రంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిండు బిందెలతో నీళ్లు పోసి,కొబ్బరి కాయలు కొట్టి ,చక్కెర,ధాన్యాలతో చదివింపులు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం

మద్దికెర : బుగ్గ సంగమేశ్వరంలో మూడు రోజులుగా జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన వసంతోత్సవంతో ముగిశాయి. తెల్లవారుజామున స్వామివారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


గ్రాఫిక్స్‌ను మరిపిస్తున్న బడ్జెట్



తెర్నేకల్ సురేందర్‌రెడ్డి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రాఫిక్స్‌ని తలపిస్తుందని, ఇచ్చిన హామీలు కొండంత, కేటాయించిన బడ్జెట్ రవ్వంత అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ వల్ల ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్క రంగానికి పూర్తిస్థాయిలో కేటయింపులు లేకుండా అరకొర కేటాయింపులతో మమ అనిపించిందన్నారు.

పింఛన్ కోసం..



మెట్లు దిగేందుకు అవస్థలు పడుతున్న అర్జునుడు

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తమ సమస్యలను విన్నవించేందుకు దివ్యాంగులు అష్టకష్టాలు పడాలి. తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీ, సబ్ ట్రెజరీ (ఉపఖజానా)కార్యాలయాలు కూడా ఉన్నాయి. అయితే వృద్ధులు, విద్యాంగులు , కంటి చూపు మందగించిన వారు ఆయా కార్యాలయాలకు వెళ్లేందుకు మెట్లు ఎక్కలేక ఆపసోపాలు పడుతున్నారు.శుక్రవారం ఆలూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు జంగాలి అర్జునుడు ఈనెల పింఛన్ తీసుకోవాలంటే అందుకు వార్డు, ఇంటి నంబర్ తదితర ఆధారాలు తీసుకురావాలని అధికారులు సూచించారు. దీంతో తన భార్య శివమ్మతో కలిసి మెట్లపైకి పాక్కుంటూ వచ్చి జాబితాలో పేరు విషయంపై ఆరా తీశారు. ఆధారాలను పరిశీలించిన డీటీ దీపా సంతృప్తి వ్యక్తం చేయడంతో ఊపిరి పీల్చుకున్నాడు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



స్వాతి (ఫైల్)

మద్దికెర: ఆరోగ్యం బాగా లేక ఇంట్లో ఉరి వేసుకొని ఇంటర్ విద్యార్థిని స్వాతి (16) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మద్దికెర రాంనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గద్దం మల్లికార్జున, రామేశ్వరమ్మలకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్దమ్మాయికి వివాహం కాగా రెండో అమ్మాయి స్వాతిని స్థానిక కాలేజీలో ఇంటర్ చేర్పించారు. అయితే ఆరోగ్యం సహకరించకపోవడంతో నెల రోజుల పాటు కళాశాలకు వెళ్లలేదు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు గుంతకల్లుకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మాండోత్సవం

- రమణీయంగా బ్రహ్మేశ్వరుని రథోత్సవం
- నేడు గ్రామోత్సవం, బండలాగుడు పోటీలు



రథోత్సవ దృశ్యం

వెల్దుర్తి: హరహర మహాదేవ నామస్మరణతో బ్రహ్మగుండం క్షేత్రం మార్మోగింది. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గంగా,గౌరీ సమేత బ్రహ్మేశ్వరస్వామి రథోత్సవం బ్రహ్మాండోత్సవంగా సాగింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ టి. హనుమంతరావ్, ఈఓ ఆంజనేయులు, నిర్వాహకుడు బొమ్మన రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రమణీయంగా సాగిన రథోత్సవాన్ని జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు కనులారా తిలకించి పులకించారు. ముందుగా సర్వాలంకారభూషితులైన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆయకట్టుదారులు, అర్చకులు మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం నుంచి రథశాలకు చేర్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై అధిష్టింపజేశారు. రథాంగపూజ, క్రతువులు నిర్వహించారు. కొబ్బరి, గుమ్మడికాయలను సాత్వికబలిగా సమర్పించి, పండితులు కిట్టయ్య శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్త పూజలనంతరం హరహరమహాదేవ నినాదాల మధ్య భక్తులు అర్చకులు శివసారథ్యంలో రథం గొలుసులను లాగి రథచక్రాలను ముందుకు కదిలించారు. దాదాపు 200 మీటర్ల దూరం రథాన్ని లాగి రథశాలకు చేర్చారు. అనంతరం ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద నుంచి ఆలయానికి చేర్చారు. రథయాత్ర ముందు నిర్వహించిన నందికోలు సేవ భక్తులను అలరించింది. ఆధ్యాత్మికతకు తోడు ఆహ్లాదంగా చిన్నారులు బొమ్మల కొనుగోళ్లు, ఆడపడుచులు గాజుల, పూజా సామగ్రి కొనుగోళ్లు, భక్తులు తిరుణాల స్పెషల్ చెరుకుగడలు, స్వీట్లు కొనుగోళ్లు చేస్తూ, జెయింట్‌వీల్ తదితరాలలో ఆహ్లాదంగా గడిపారు. దాతల ఆధ్వర్యంలో 7 ఉచిత బస్సు సర్వీసులు నడిచాయి. మాజీ ఎంపీపీలు దశరథ రామిరెడ్డి, ఎల్‌ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు వసంతోత్సవం, బండలాగుడు పోటీలు

మార్చి 1వ తేదీన స్వామి, అమ్మవార్ల దేవతామూర్తులకు వసంతోత్సవం నిర్వహించనున్నారు. అలాగే ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగనున్నాయి. సాయంత్రం దేవతామూర్తులకు వెల్దుర్తిలో గ్రామోత్సవం నిర్వహణతో ఉత్సవాలు ముగియనున్నాయి.

బి.తాండ్రపాడు వృషభాల జయకేతనం



చెర్లకొత్తూరులో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: చెర్లకొత్తూరులో ఫక్కీరప్పతాత తిరునాల సందర్భంగా శుక్రవారం ఆరుపండ్ల ఎద్దుల విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు చిన్నరత్నం వృషభాలు విజేతలుగా నిలిచి రూ.40వేలు గెలుచుకున్నాయి. తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా కర్నూలు పసుపల శేఖర్, అనంతపురం రాయలచెరువు జయచంద్రారెడ్డి వృషభాలు సంయుక్తంగా, గద్వాల ఈడిగోనిపల్లె వంశీకృష్ణ, వెల్దుర్తి కలుగొట్ల రమేశ్‌నాయుడు వృషభాలు సంయుక్తంగా, నంద్యాల కొనిదెల దండు వెంకటేశ్వర్లు , నంద్యాల మల్యాల షేక్ మైమున్నా, పత్తికొండ పందికోన లవ్‌కుమార్ ఎద్దులు సంయుక్తంగా నిలిచాయి. వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు,రూ.10 వేలు,రూ.5వేలు గెలుచుకున్నాయి. అలాగే గుండు ఎత్తు పందెంలో గోసానిపల్లె సోదరులు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలవగా, పరుగు పందెంలో సిద్ధినగట్టు సుదర్శన్, రామకృష్ణాపురం చంద్ర నిలిచి వెండి బహుమతులు గెలుచుకున్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

- విజేతగా నిలిచిన హెచ్.కైరవాడి వృషభాలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామ సమీపంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ ప్రారంభించారు. పోటీల్లో 7 జతల వృషభాలు పాల్గొన్నాయి. హోరా హోరీగా జరిగిన పోటీల్లో హెచ్. కైరవాడి వృషభాలు విజేతగా నిలవగా యజమాని లక్ష్మన్న రూ. 50 వేలు సొంతం చేసుకున్నారు. ఆ తరువాతి స్థానాల్లో.. నందవరం రైతు జింకల మహేష్ ఎద్దులు రూ.40 వేలు, యనగండ్ల రైతు బాయికాటి బోడెన్న వృషభాలు రూ. 30 వేలు, బళ్లారి, అనంతపురం రైతులు రమేష్‌బాబు, నిఖిల్ కుమార్ ఎద్దులు సంయుక్తంగా రూ. 20 వేలు, మునగాలకు హనుమన్న ఎద్దులు రూ.10 వేలు అందుకున్నారు. అంతకుముందు పంచలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి ప్రత్యేక పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, బిణిగేరి గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. జెడ్పీటీసీ దొరబాబు, సర్పంచ్ వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, పెద్దయ్య, సుంకర రామాంజనేయులు, మూలింటి రాఘవేంద్ర, గోవర్ధన, అశోక్, దత్తాత్రేయరెడ్డి, పురుషోత్తమరెడ్డి, సోమన్న, చిన్నరెడ్డి, వెంకటేష్,భీమన్న పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్

పత్తికొండ రూరల్ : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తనీయకుండా చూడాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ భరత్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండలాల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎల్‌పీఓ వీరభద్రప్ప, డీఎల్‌డిఓ అనురాధ, పీఆర్ డీఈ శేషయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబుబ్‌ఖాన్, ఈఓ ఆర్‌డీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే



ఆలూరులో హోవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్లు

ఆలూరు రూరల్: టైలర్స్ డే ఆలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక జ్యోతిబసు భవన్‌లో శుక్రవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అధ్వర్యంలో టైలర్స్ తాలూకా అధ్యక్షుడు రఫీక్,కార్యదర్శి విష్ణు ఆధ్వర్యంలో కుట్టు మిషన్ ఆవిష్కరణ కర్త విలియం ఎలియాస్ హోవే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పత్తికొండ రూరల్ : పత్తికొండలో టైలర్స్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టైలర్స్ యూనియన్ కార్యాలయం వద్ద కుట్టు మిషన్ ఆవిష్కరణకర్త హోవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టైలర్లు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా ర్యాలీ నిర్వహించారు. యూనియన్ తాలుకా అధ్యక్షుడు రంగన్న, టైలర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



బోయబొంతిరాళ్లలో గ్రామస్తులకు సూచనలిస్తున్న డీఎస్‌ఎంఓ మల్లికార్జునరెడ్డి

కృష్ణగిరి: ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవని డీఎస్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో శుక్రవారం ఆయన సర్పంచ్ రవిమోహన్ అధ్యక్షతన గ్రామస్తులకు ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. టీబీ ముక్తా పంచాయతీ కింద బోయ బొంతిరాళ్ల పంచాయతీ పనితీరు, ఫలితాలు బాగున్నాయని గుర్తించి జిల్లా అవార్డు ఇవ్వడానికి ఉన్నతాధికారులు ఎంపిక చేశారన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ముఖ్యంగా పొగాకు, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. దగ్గు, జలుబు తరచూ వస్తుంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ గళ్ల ఉమ్మితే ఒకరి నుంచి మరొకరి టీబీ సోకే అవకాశం ఉందన్నారు. జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ ఉమాపతి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం కల్పన దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సీనియర్ డైట్ లెక్చరర్ ముప్పా గోవిందు అన్నారు. కృష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కల్పన పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆమెను సన్మానించి సేవలను కొనియాడారు. కల్లూరు ఎంఈఓ-2 వనజకుమారి, రిటైర్డ్ హెచ్‌ఎంలు అనసూయదేవి, విజయలక్ష్మి, ద్వారకానాథ్, హెచ్‌ఎం మైఖేల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాదా బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో ప్రతిభ మెరుగు



ఎగ్జిబిషన్ ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు

మద్దికెర : సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలతో విద్యార్థుల్లో ప్రతిభ మెరుగుపడుతుందని కరస్పాండెంట్ వెంకట్‌మాధవ్, ప్రిన్సిపాల్ బాలసునీత అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీవిద్యాసాయి విద్యాసంస్థలో సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు పలు అంశాలపై నమూనాలను ప్రదర్శించారు.

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాలతి సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను ఆమె పరిశీలించి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జరిగిన సైన్సు దినోత్సవంలో సైన్సు ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్‌కుమార్ వివరించారు.

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ డేను హెచ్‌ఎం సోమలింగప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్ సీ వీ రామన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ అగ్రగణ్యుడని హెచ్‌ఎం మైఖేల్ అన్నారు. మండలంలోని కోయిలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు.

నోటీస్ బోర్డు

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

తుగ్గలి : పత్తికొండ నియోజవకర్గంలోని 33,241 మంది లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పాటు, ఇతర శాఖల సిబ్బంది కూడా పాల్గొని లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు అందజేయనున్నారు. పత్తికొండ మండలంలో 8,474 మందికి రూ.3,69,28,500, తుగ్గలిలో 7,539 మందికి రూ.3,27,93,000, కృష్ణగిరిలో 4,731 మందికి రూ.2,06,59,000, వెల్దుర్తిలో 7,806 మందికి రూ.3,32,39,500, మద్దికెరలో 4,691 మందికి రూ.2,01,22,500 ప్రభుత్వం నుంచి పింఛన్ సొమ్ము మంజూరైంది. ఈ మేరకు పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు.

చిట్టీల పేరుతో కుచ్చుటోపీ

- కోట్లు వసూలు చేసి పరార్
- లబోదిబోమంటున్న బాధితులు

తుగ్గలి : నెలవారీ చిట్టీల పేరుతో హైదరాబాద్ ఎస్‌ఆర్ నగర్‌లో ఓ వ్యక్తి కోట్లు కుచ్చుటోపీ పెట్టడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. దశాబ్దాల క్రితం బతుకు దెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన అనంతపురం జిల్లా గుత్తి మండలానికి చెందిన పుల్లయ్య తాపీ మేస్త్రీగా పని చేస్తూ చిట్టీలు నడపడం ప్రారంభించారు. ఆ తర్వాత మేస్త్రీ పని మానేసి చిట్టీల వ్యాపారంపై దృష్టి సారించి బిల్డర్లకు ఫైనాన్స్ ఇచ్చేస్థాయికి ఎదిగాడు.

నమ్మించి.. నట్టేట ముంచి ..

బతుకుదెరువు నిమిత్తం పత్తికొండ, గుంతకల్లు, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన పలు పేద కుటుంబాలు నగరంలో చెత్త రిక్షాలతో జీవనం సాగిస్తున్నారు. ఎస్‌ఆర్ నగర్, బల్కంపేట, సనత్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న చెత్త రిక్షా కార్మికులు వందల మంది పుల్లయ్య, అతని కుమారుడు రామాంజనేయులు వద్ద చిట్టీలు వేస్తూ లావాదేవీలు కొనసాగించారు. ఒక్కొక్కరు రూ.5లక్షల నుంచి రూ.కోటి వరకు చిట్టీలు వేశారు. కొంత కాలంగా సవ్యంగా అందరికీ చిట్టీ డబ్బులు ఇచ్చి నమ్మకం పెంచుకున్నారు. ఆ తర్వాత చిట్టీలు పాడినవారు, కంతులు చెల్లించిన వారికి అధిక వడ్డీ ఆశ చూపి మాయమాటలు చెప్పి ఆ డబ్బు తమ వద్దే ఉంచుకున్నారు.

అయితే ఐదారు నెలలుగా వడ్డీ డబ్బులు చెల్లించక, చిట్టీలు పాడిన వారికి కూడా డబ్బులు ఇవ్వకుండా వాయిదా వేస్తూ వచ్చారు. చివరకు వారం క్రితం కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి రాత్రే ఉడాయించారు. దాదాపు రూ.100 కోట్ల వరకు టోకరా వేసినట్లు సమాచారం. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితుల్లో తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామస్తులు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి నుంచి నిద్రలేక చెత్తచెదారం ఏరి వచ్చిన డబ్బులు, అప్పులు కట్టుకునేందుకు, అవసరాల కోసం వస్తాయని చిట్టీలు వస్తే ఇలా మోసం చేశారని బాధితులు వాపోతున్నారు.

జాబ్‌మేళాలో 25 మంది ఎంపిక

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 49 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూకు హాజరు కాగా 25 మంది ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజు తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ఆస్పరి: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కైరుప్పల జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుచున్న 48 విద్యార్థులకు కామ్రేడ్ బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి తరపున పరీక్ష ప్యాడ్లు, స్కేళ్లు, పెన్నులు ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహకరంగా రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యి అందజేయనున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం. షఫీ, సీపీఐ నాయకులు విరుపాక్షి, రమేష్, వీరేష్, చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు



పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్ష సెంటర్‌లో హాల్‌టికెట్ నెంబర్లు వేయిస్తున్న అధికారులు

పత్తికొండ రూరల్ : ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి 14రోజుల పాటు జరిగే పరీక్షలకు సంబంధించి ముందుగా శుక్రవారం పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఏపీ మోడల్ స్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేయించి పరీక్ష కేంద్రాలను అధికారులు పర్యవేక్షించారు. పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థులు 443, సెకెండియర్ 348 మంది విద్యార్థులు, ఏపీ మోడల్ స్కూల్‌లో ఫస్టియర్ 215, సెకెండియర్ 213 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9–12గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులు హాల్‌టికెట్ ఒరిజినల్‌తో పాటు ఆధార్‌కార్డు లేదా కాలేజీ ఐడీ కార్డుతో అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పరీక్షల చీఫ్ సూపరిండెంట్‌లు నయీమున్నీసా బేగం, విక్టర్ శ్యామ్యూల్ తెలిపారు. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ అని అధికారులు పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిఘా నీడన పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

ఆలూరు రూరల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు నేటి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో 4,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 22 గదులు సిద్ధం చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

హొళగుంద: శనివారం నుంచి జరిగే ఇంటర్ మొదటి సంవత్సరం, 3వ తేదీ నుంచి మొదలయ్యే రెండవ సంవత్సరం పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఫస్టియర్‌లో 117, సెకండియర్‌లో 170 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. కేంద్రాల నిర్వహణకు చీఫ్‌గా ప్రిన్సిపాల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బాబు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

వెల్దుర్తి, కృష్ణగిరి: ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వెల్దుర్తి జూనియర్ కాలేజీ సెంటర్‌గా వెల్దుర్తి మండలంలోని జూనియర్ కాలేజీ, బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులం, కేజీబీవీ, కేవీఆర్ కాలేజీలకు చెందిన 212 మంది విద్యార్థులు, కృష్ణగిరి మోడల్ స్కూల్ సెంటర్‌గా కృష్ణగిరి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యార్థులు 259 మంది మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు సబ్జెక్ట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు వ్రాయనున్నట్లు ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్‌లు మల్లికార్జున, మైమున్నీసా తెలిపారు.

సర్వం సిద్ధం

ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశాం. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తాం. విద్యార్థులు హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రంలో తమకు కేటాయించిన గదుల్లోకి 10 నిమిషాల ముందే చేరుకోవాలి. అన్ని రూముల్లో సీసీ కెమెరాలు అమర్చాం. ప్రతి గదిలో మౌలిక వసతులు ఏర్పాటు చేశాం.

– కృపాకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్,ఆలూరు

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల తెర్నేకల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం.నారాయణ తనవంతుగా రూ.75 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో తెర్నేకల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌బాబు, ప్రధాన కార్యదర్శి వెంకప్ప, కోశాధికారి రాజశేఖర్, ఇతర నాయకులు మధుసూదన్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

ఆలూరు: ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి పోరాడాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో ఆలూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు,మాజీ ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఓబులేసు,మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున ఉన్నారు.